# ప్రభాత ఉదయం

తెలుగు దినపత్రిక



**రిపోర్టర్లు కావలెను**

అత్యంత ప్రజాదరణ పొందిన ప్రభాత ఉదయం తెలుగు దినపత్రికలో పనిచేయుటకు తెలంగాణ వ్యాప్తంగా జిల్లా, మండల మరియు నియోజకవర్గాల వారీగా రిపోర్టర్లు కావలెను.

ప్రభాత ఉదయం

సంప్రదించండి
ఫోన్: 93910 89608



సంపుటి: 2 | సంచిక: 231 | పేజీలు: 4 | వెల: రూ.3/- | గురువారం 28 నవంబర్ 2024 | ఎడిటర్: కోట్ల చంద్రకాంత్


# అన్నదాతల పోరాటం ఫలప్రదం



## దిలావర్‌పూర్‌లో అంతా ప్రశాంతం

దిలావర్‌పూర్‌లో అర్ధరాత్రి ఆందోళనను విరమించిన రైతులు

రైతుల ఆందోళన విరమణతో హైవేపై కొనసాగుతున్న వాహనాల రాకపోకలు

దిలావర్‌పూర్‌లో కలెక్టర్ స్పందనతో ఆందోళన విరమించిన రైతులు

**నిర్మల్, నవంబర్ 27 (ప్రభాత ఉదయం):** తీవ్ర ఉద్రిక్తతలు అరెస్టులు రాళ్లు రువ్వటం, భయంతో పోలీసులు పరుగుతీయటం ఆందోళనతో దద్దరిల్లిన 61 నంబర్ జాతీయ రహదారి వెరసి రాష్ట్రంలో సంచలనం రేకెత్తించిన నిర్మల్ జిల్లా దిలావర్పూర్-గుండంపెల్లి గ్రామాల మధ్య ఏర్పాటు చేయనున్న ఇథనాల్ పరిశ్రమను రద్దుకో సం బాధిత ప్రజలు చేస్తున్న పోరాటం బుధవారం రాత్రి ఫలప్రదమైంది. నిర్మల్ జిల్లా దిలవార్ పూర్ మండలంలో నిర్మిస్తున్న ఇథనాల్ పరిశ్రమ రద్దుకు రాజకీయాలకు తావీయకుండా రెండు రోజులుగా జరిగిన ఆందోళనకు మహిళలే ముందు నిలిచారు. పిల్లా, పాపలతో కలిసి ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 6 గంటలవరకు చావో, రేవో అన్నట్లు పురుగుమందు డబ్బాలతో రోడ్డుమీద బైఠాయించి నిరసనలో పాల్గొన్నారు. వంటవార్పు చేశారు. అంతకుముందు దిలావర్పూర్ గుండంపెల్లి గ్రామశివారులో భారీగా మోహరించిన పోలీసు బలగాల మధ్య కొంతమంది పోలీసులు ముందస్తు అరెస్టు చేయటం తీవ్ర ఉద్రిక్తలకు దారితీసింది. విషయం తెలిసి భారీ సంఖ్యలో మహిళలు దిలావర్పూర్ పోలీసు స్టేషన్ ముందు, ఆతర్వాత నిర్మల్-బైంసా 61 జాతీయ రహదారిపై బైఠాయించటానికి బయలుదేరగా పోలీసులు అడ్డుకునేందుకు యత్నించారు. ప్రతిఘటించే క్రమంలో ఓ దశలో ఆందోళనకారులు రాళ్లు రువ్వగా పోలీసులు భయంతో పరుగుతీశారు. నిర్మల్ ఎమ్మెల్యే మహేశ్వర్‌రెడ్డి, మాజీ మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు శ్రీహరిరావుకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు.. రైతులతో కలెక్టర్ , ఎస్పీ చర్చలు : రాష్ట్ర ప్రభుత్వం తరపున నిర్మల్ కలెక్టర్ అభిలాష అభినవ్, ఎస్పీ జానకి షర్మిళ బుధవారం చర్చలకు ఆహ్వానించటం ప్రజల్లో ఆనందం వ్యక్తమైంది. నిర్మల్ కలెక్టరేట్లో ..మిగతా 2లో



## పాఠశాలలో ఫుడ్ పాయిజనింగ్‌పై
# హైకోర్టు ఆగ్రహం

### చనిపోతే గానీ స్పందించరా అని నిలదీత..?

**హైదరాబాద్, నవంబర్ 27 (ప్రభాత ఉదయం):** నారాయణపేట జిల్లా మాగనూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఫుడ్ పాయిజనింగ్ ఘటనపై తెలంగాణ హైకోర్టు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. అధికారులు నిద్రపోతున్నారా? అంటూ తీవ్రంగా స్పందించింది. వారంలో మూడుసార్లు ఫుడ్ పాయిజనింగ్ జరిగితే అధికారులు ఏం చేస్తున్నారని నిలదీసింది. స్కూల్‌లో ఫుడ్ పాయిజనింగ్ చాలా సీరియస్ అంశమని సీజే జస్టిస్ అలోక్ అరాధే అన్నారు. పిల్లలు చనిపోతే గానీ స్పందించరా? అంటూ హైకోర్టు ప్రభుత్వాన్ని ప్రశ్నించింది. అధికారుల నిర్లక్ష్యానికి ఈ ఘటన నిదర్శనమని.. ప్రభుత్వం ఈ అంశాన్ని సీరియస్‌గా తీసుకోవడం లేదంటూ తలంటింది. ఘటనపై వారంలోగా కౌంటర్ దాఖలు చేస్తామని ప్రభుత్వం తరపున న్యాయవాది ..మిగతా 2లో

# ఇస్రో శుక్రయాన్‌కు కేంద్రం గ్రీన్ సిగ్నల్



**న్యూఢిల్లీ, నవంబర్ 27 (ప్రభాత ఉదయం):** భారతీయ అంతరిక్ష పరిశోధనా సంస్థ కీలకమైన మిషన్లు చేపట్టబోతున్నది. వీనస్‌తో పాటు గగన్‌యాన్, చంద్రయాన్-3 ప్రాజెక్టులకు సిద్ధమవుతున్నది. 2028లో ఇస్రో శుక్రయాన్ మిషన్ ప్రయోగించనుండగా.. ఈ ప్రాజెక్టుకు కేంద్రం ఆమోదం తెలిపిందని ఇస్రో డైరెక్టర్ నీలేశ్ దేశాయ్ తెలిపారు. సింథటిక్ ఎపర్చర్ రాడార్, అల్ట్రావైలెట్ ఇమేజింగ్ సిస్టమ్ తదితర అత్యాధునిక టెక్నాలజీతో కూడిన పరికరాలతో శుక్రుడి వాతావరణంపై పరిశోధన జరుపనున్నది. దట్టమైన కార్బన్‌డయాక్సైడ్, సల్ఫ్యూరిక్ ఆమ్లం, క్రియాశీల అగ్నిపర్వతాలను గుర్తించడంతో పాటు గ్రహం భౌగోళిక కార్యకలాపాలను అంచనా వేయడం మిషన్ ముఖ్య లక్ష్యాల్లో ఒకటి. చంద్రయాన్-3 విజయం తర్వాత.. జపాన్‌తో కలిసి చంద్రయాన్-4 ఇస్రో ..మిగతా 2లో

# ఇజ్రాయెల్-హెజ్‌బొల్లా మధ్య కాల్పులపై కీలకమైన పరిణామం



## కాల్పుల విరమణ ఒప్పందాన్ని ప్రకటించిన బైడెన్

**న్యూఢిల్లీ, నవంబర్ 27 (ప్రభాత ఉదయం):** ఇజ్రాయెల్-హెజ్‌బొల్లా మధ్య కాల్పుల విషయంలో కీలకమైన పరిణామం చోటు చేసుకుంది. ఇజ్రాయెల్ ప్రభుత్వం హెజ్‌బొల్లాతో కాల్పుల విరమణపై అంగీకారం కుదుర్చుకున్నట్లు అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ వెల్లడించారు. ఈ విషయాన్ని ఆయన ఎక్స్ వేదికగా చేసిన పోస్ట్‌లో ప్రకటించారు. 'ఇదొక శుభవార్త. నేను ఇజ్రాయెల్, లెబనాన్ ..మిగతా 2లో

# మోదీ నిర్ణయమే ఫైనల్

## మా మధ్య ఎలాంటి విభేదాలు లేవు

ఏక్‌నాథ్ షిండే కీలక వ్యాఖ్యలు



**ముంబై, నవంబర్ 27 (ప్రభాత ఉదయం):** మహారాష్ట్రలో సీఎం పదవిపై ఉత్కంఠ కొనసాగుతున్న వేళ, రాష్ట్రపు అపద్ధర్మ ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ షిండే కీలక వ్యాఖ్యలు చేశారు. ఆయన తనకు ఎలాంటి అసంతృప్తి లేదని స్పష్టం చేశారు. ముఖ్యమంత్రి పదవిపై ఎలాంటి నిర్ణయమైనా ప్రధాని మోదీ, కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా నిర్ణయమే తుది నిర్ణయమని ఆయన పేర్కొన్నారు. బుధవారం థానేలో తన నివాసంలో జరిగిన మీడియా సమావేశంలో ..మిగతా 2లో

## తెలంగాణలో భాజపా
# వేగంగా విస్తరిస్తోంది

## ప్రధానమంత్రి నరేంద్ర మోదీ

మోదీతో తెలంగాణ భాజపా

ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు సమావేశం



**న్యూఢిల్లీ, నవంబర్ 27 (ప్రభాత ఉదయం):** తెలంగాణలో భాజపా వేగంగా విస్తరిస్తోందని ప్రధానమంత్రి నరేంద్రమోదీ అన్నారు. రాష్ట్రానికి చెందిన భాజపా ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు బుధవారం ప్రధాని నరేంద్ర మోదీతో సమావేశం అయ్యారు. ఢిల్లీ: తెలంగాణలో భాజపా వేగంగా విస్తరిస్తోందని ప్రధానమంత్రి ..మిగతా 2లో

## ఫోన్ ట్యాపింగ్ కేసులో బెయిల్ కోసం
# పోలీసులు విశ్వ ప్రయత్నాలు

### తిరుపతన్న బెయిల్ పిటిషన్ డిసెంబర్ 18వ తేదీకి వాయిదా



**న్యూఢిల్లీ, నవంబర్ 27 (ప్రభాత ఉదయం):** తెలంగాణ రాష్ట్రంలో ఫోన్ ట్యాపింగ్ కేసు ఎంతటి దుమారాన్ని రేపిందో అందరికీ తెలిసిందే. ఈ కేసులో అరెస్ట్ అయిన పోలీసు అధికారులు బెయిల్ కోసం విశ్వప్రయత్నాలు చేస్తున్నారు. అయితే వారికి ప్రతీసారీ నిరాశే మిగులుతోంది. ఈ కేసులో అరెస్ట్ అయిన పోలీస్ అధికారి తిరుపతన్న తనకు బెయిల్ మంజూరు చేయాలని కోరుతూ సుప్రీం కోర్టును ఆశ్రయించారు. ఫోన్ ట్యాపింగ్ కేసులో బెయిల్ కోసం అదనపు ఎస్పీ తిరుపతన్న సుప్రీం కోర్టులో వేసిన పిటిషన్‌పై బుధవారం విచారణ జరిగింది. దీనిపై కౌంటర్ దాఖలు చేసేందుకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం సమయం కోరింది. దీంతో జస్టిస్ బీవీ నాగరత్న, జస్టిస్ కోటేశ్వర్ సింగ్‌ల ధర్మాసనం కౌంటర్ దాఖలుకు రెండు వారాల సమయం ఇస్తూ.. తదుపరి విచారణ డిసెంబర్ 18వ తేదీకి వాయిదా వేసింది. కాగా ఫోన్ ట్యాపింగ్ కేసులో అదనపు ఎస్పీ తిరుపతన్నను పోలీసులు అరెస్ట్ చేసిన విషయం తెలిసిందే. బెయిల్ కోసం హైకోర్టులో ..మిగతా 2లో

# పాఠశాలలో ఫుడ్ పాయిజనింగ్‌పై హైకోర్టు ఆగ్రహం

మొదటి పేజీ తరువాయి...

హైకోర్టుకు తెలుపగా.. ఆగ్రహం వ్యక్తం చేసింది. వివరాల సేకరణకు వారం సమయం ఎందుకని నిలదీసింది. హైకోర్టు ఆదేశిస్తేనే అధికారులు పని చేస్తారా? అని నిలదీసింది. నాన్ బెయిలబుల్ వారెంట్ జారీ చేస్తే ఐదు నిమిషాల్లో హాజరవుతారని హైకోర్టు చెప్పింది. అధికారులకు కూడా పిలున్నారని.. మానవతా దృక్పథంతో వ్యవహరించాలని సూచించింది. ఘటనపై భోజన విరామం తర్వాత పూర్తి వివరాలు అందజేస్తామని ఏఏజీ కోర్టుకు తెలిపారు. మధ్యాహ్న భోజనంలో నాణ్యత ప్రమాణాలు పాటించడం లేదని హైకోర్టులో పిల్ దాఖలైంది. పిటిషనర్ తరఫున సీనియర్ న్యాయవాది చిక్కుడు ప్రభాకర్ వాదనలు వినిపించారు. రాష్ట్రవ్యాప్తంగా పాఠశాలల్లో తరుచూ భోజనం వికటిస్తుందని ప్రభాకర్ హైకోర్టు దృష్టికి తీసుకెళ్లారు. నారాయణపేట జిల్లా మానగూరు జడ్పీ పాఠశాలలో మంగళవారం ఫుడ్ పాయిజనింగ్ జరిగిన విషయం తెలిసిందే. పాఠశాలలో మధ్యాహ్న భోజనం చేసిన పిల్లలు అస్వస్థతకు గురయ్యారు. దాదాపు 30 మంది విద్యార్థులు వాంతులు, తలనొప్పి, కడుపు నొప్పితో బాధపడగా.. వెంటనే వారిని మక్తల్ ఆసుపత్రికి తరలించారు. పాఠశాలలో వారం వ్యవధిలోనే మరోసారి ఫుడ్ పాయిజనింగ్ జరిగింది. ఇంతకు ముందు 20న ఫుడ్ పాయిజనింగ్ కారణంగా వంద మంది విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారు. ఇటీవల రాష్ట్రవ్యాప్తంగా ఫుడ్ పాయిజనింగ్ కేసులు వెలుగు చూస్తున్నాయి.

కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లా వాంకిడి గురుకుల








పాఠశాలలోనూ ఫుడ్ పాయిజనింగ్ జరిగిన విషయం తెలిసిందే. 60 మంది విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారు. ఈ ఘటనలో చౌదరి శైలజ అనే విద్యార్థి పరిస్థితి విషమించి.. చివరకు చికిత్స పొందుతూ మృతి చెందిన విషయం విధితమే. శైలజకు అక్టోబర్ 30న పాఠశాలలో వాంతులు విరేచనాలు కావడంతో వాంకిడి వైద్యశాలలో చికిత్స అందించారు. ఆ తర్వాత పరిస్థితి విష మించడంతో మంచిర్యాలలోని ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స చేసి మెరుగైనవైద్యం కోసం హైదరాబా ద్‌లోని నిమ్స్‌కు తరలించారు. దాదాపు 20 రోజులుగా వెంటిలేటర్‌పై చికిత్సపొందిన విద్యార్థిని గత సోమవారం తుదిశ్వాస విడిచింది.



# అన్నదాతల పోరాటం ఫలప్రదం

మొదటి పేజీ తరువాయి...

అధికారులు, రైతుల మధ్య గంటన్నరపాటు మూడు ప్రధాన డిమాండ్లపై చర్చ జరిగింది. ఒకటి భేషరతుగా ఇథనాల్ పరిశ్రమను రద్దు చేయాలి. రెండోది ఏడాదిన్నర కాలంగా వివిధ కారణాలతో రైతులపై పెట్టిన కేసులను ఎత్తివేయటం, మూడోది ఆందోళనకు మద్దతు ఇచ్చిన ప్రభుత్వ ఉద్యోగులపై విధించిన సస్పెన్షన్లను వెనక్తి తీసుకోవాలని రైతులు డిమాండ్ చేయగా అధికారుల నుంచి సానుకూలత వచ్చింది. ఇచ్చిన మాట ప్రకారం పరిశ్రమ దగ్గర పనులను ఆపివేయించాలని పేర్కొన్న రైతలు ఒకవేళ ప్రభుత్వం మాటతప్పితే మళ్లీ ఉద్యమం చేయటానికి వెకకాడబోమని స్పష్టం చేశారు. పరిశ్రమ దగ్గర జరిగే పనులను ఆపివేయాలని కలెక్టర్ ఆదేశాలు జారీచేయటంతో రైతులు ఆందోళనను విరమించినట్లు కలెక్టరేట్లో అంగీకారం కుదరింది . అనంతరం రైతు ప్రతినిధులు దిలావర్పూర్ వద్ద జాతీయ రహదారిపై బైరాయించిన ఆందోళనకారుల వద్దకు వచ్చారు. అధికారులతో జరిగిన చర్చలు సారాంశం వివరించి ఆందోళనను విరమించారు. టపాసులు పేల్చి ఆనందం పంచుకున్నారు. ఎస్పీ జానకి షర్మిల దిలావర్పూర్ వచ్చి మహిళలతో ఆనందం పంచుకున్నారు. రాష్ట్రమంత్రి సీతక్కతో ఫోన్లో మట్లాడించారు. కేసులు ఎత్తివేత విషయంలోనూ ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి న్యాయం జరిగేలా చూస్తానని హామీ ఇచ్చారు.



## తెలంగాణలో భాజపా వేగంగా విస్తరిస్తోంది

మొదటి పేజీ తరువాయి...

నరేంద్ర మోదీ అన్నారు. రాష్ట్రానికి చెందిన భాజపా ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు బుధవారం ప్రధాని మోదీతో సమావేశమయ్యారు. పార్లమెంట్‌లోని తన కార్యాలయంలో తెలంగాణ భాజపా నేతలతో ప్రధాని ప్రత్యేకంగా సమావేశమై.. రాష్ట్రంలోని రాజకీయ పరిస్థితులు, వివిధ అంశాలపై చర్చించారు. అనంతరం సమావేశం ఫొటోలతో మోదీ 'ఎక్స్'లో తెలుగులో పోస్టు పెట్టారు. "తెలంగాణ భాజపా ఎంపీలు, ఎమ్మెల్యేలతో సమావేశం చాలా బాగా జరిగింది. రాష్ట్రంలో మా పార్టీ ఉనికి వేగంగా విస్తరిస్తోంది. తెలంగాణ ప్రజలు ఇప్పటికే కాంగ్రెస్‌తో విసిగిపోయారు. భారాస దుష్టపాలన వల్ల కలిగిన భయంకరమైన జ్ఞాపకాలతో ఉన్నారు. ఎంతో ఆశతో భాజపా వైపు చూస్తున్నారు. కాంగ్రెస్, భారాస ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా భాజపా తన స్వరాన్ని గట్టిగా వినిపిస్తూనే ఉంటుంది. మా కార్యకర్తలు మా అభివృద్ధి ఎజెండాను వివరిస్తూనే ఉంటారు" అని మోదీ పేర్కొన్నారు.

## మోదీ నిర్ణయమే ఫైనల్

మొదటి పేజీ తరువాయి...

ఆయన ఈ విషయాన్ని స్పష్టం చేశారు."పోరాటం నా రక్తంలో ఉంది,"అని ఏక్‌నాథ్ చెప్పారు.మహాయుతి గెలుపు కోసం ఆయన పలు సంవత్సరాల పాటు కార్యకర్తగా పనిచేసినట్లు పేర్కొన్నారు."నేను ఒక కార్యకర్తగా పని చేసి ఒక కార్యకర్తలా చెప్పులు అరిగేలా తిరిగానని పేర్కొన్నారు"అని తెలిపారు. పార్టీకి వచ్చిన విజయం గురించి, ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. ప్రజలు మహావికాస్ అఘాడీ కూటమిని తిరస్కరించిన విషయం మీద శింధే వ్యాఖ్యానించారు. "మా దృష్టిలో ముఖ్యమంత్రి అంటే ప్రజలతో నేరుగా సంబంధం ఉన్న వ్యక్తి," అని ఆయన చెప్పారు. తాను ఎప్పటికీ అధికారికంగా ఒక ముఖ్యమంత్రిగా ప్రవర్తించలేదని, ఒక సాధారణ వ్యక్తిగా ప్రజల మధ్య తిరిగానని చెప్పారు. ఆయన ఒక రైతు కుటుంబం నుండి వచ్చారని, పేదల కష్టాలను బాగా అర్థం చేసుకునే వ్యక్తిగా ఉన్నారని వెల్లడించారు. "జీవితంలో ఎన్నో అడ్డంకులు చూశాను," అని ఆయన తెలిపారు. మహారాష్ట్ర అభివృద్ధి తన ప్రధాన లక్ష్యమని, బాల్ థాక్రే ఆశయాలను కొనసాగించగలిగే విధంగా పనిచేస్తానని పేర్కొన్నారు. ఆయనకు ప్రధాని మోదీ నుండి పూర్తిగా మద్దతు ఉందని అన్నారు."ప్రమోషన్ల కోసం అనవసరంగా వార్తల్లో ఉండాలని నాకు అభిరుచి లేదు," అని స్పష్టం చేశారు. తన సహచర మంత్రులతో కలిసి తాను 24/7 పనిచేశామని, ఇకపై ముఖ్యమంత్రిగా ఎవరు నియమించబడతారో బీజేపీ హైకమాండ్‌నే నిర్ణయించాల్సి ఉందని చెప్పారు."ముఖ్యమంత్రి పదవిపై మోదీ,అమిత్ షా వారు తీసుకునే నిర్ణయమే తుది నిర్ణయమని, ఎవరైనా నిర్ణయం తీసుకున్నా, నేను అది అంగీకరించి, వారికోసం పనిచేస్తానని" అన్నారు.

## ఇజ్రాయెల్-హెజ్‌బొల్లా మధ్య కాల్పులపై కీలకమైన పరిణామం

మొదటి పేజీ తరువాయి...

నాయకులతో మాట్లాడాను. టెల్అవీవ్-హెజ్‌బొల్లాల మధ్య ఉత్కంఠభరిత పరిస్థితులకు ముగింపు చేకూర్చేందుకు అమెరికా చేసిన ప్రయత్నాలను వారు సమర్థించారు. ఇది ఒక మంచి అడుగు" అని బైడెన్ తెలిపారు.ఇక ఈ పరిణామంపై ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు కూడా స్పందిస్తూ, ఈ ఒప్పందం ఎంతకాలం అమలులో ఉంటుందనేది లెబనాన్ వైఖరిపై ఆధారపడి ఉంటుందని అన్నారు. "మేము ఒప్పందానికి కట్టుబడి ఉంటాం. కానీ ఉల్లంఘనల జరిగితే తగిన ప్రతిస్పందన ఇస్తాం. విజయం సాధించే వరకు మేము ఏకంగా పోరాటం కొనసాగిస్తాం" అని నెతన్యాహు స్పష్టం చేశారు.



## ప్రజాపాలన అంటే నిర్బంధాలా..?

### నిర్బంధాలతో ఉద్యమాలు ఆగుతాయా?

### కాంగ్రెస్ పాలనను ప్రశ్నించిన ఎమ్మెల్సీ కవిత

హైదరాబాద్, నవంబర్ 27 (ప్రభాత ఉదయం): ప్రజాపాలన అంటూ చెప్పుకునే కాంగ్రెస్ ప్రభుత్వం నిర్బంధాలతో పాలన సాగిస్తుందని ఎమ్మెల్సీ కవిత అన్నారు. మాగునూరు జెడ్పీ హైస్కూల్‌లో వరుస ఫుడ్ పాయిజన్ ఘటనలపై బీఆర్ఎస్ నేతలు ప్రశ్నిస్తారని, ప్రజలతో కలిసి ఉద్యమిస్తారనే భయంతో తెల్లవారుజామునే అక్రమ అరెస్టులకు తెరలేపింది కాంగ్రెస్ సర్కార్ అంటూ ధ్వజమెత్తారు. ప్రజా పాలను అంటూ గొప్పలు చెప్పుకుంటున్న కాంగ్రెస్ పెద్దలు, ప్రజలు నిలదీస్తారనే భయంతో బీఆర్ఎస్ నేతలు, ప్రజలను నిర్బందిస్తూ, తెలంగాణ ఉద్యమం నాటి సమైక్య రాష్ట్ర ప్రభుత్వ అణిచివేతలను తలపిస్తున్నాయన్నారు. బీఆర్ఎస్ నేత, మాజీ ఎమ్మెల్యే చిట్టెం రాం మోహన్ రెడ్డి, కార్యకర్తల ముందస్తు అరెస్టును తీవ్రంగా ఖండించారు. తెలంగాణ గడ్డ పోరాటాల పురిటిగడ్డ.. అక్రమ అరెస్టులు, నిర్బంధాలతో ప్రజా తిరుగుబాటులను అణిచివేయాలనుకోవడం మూర్ఖత్వమన్నారు. మాగనూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఫుడ్ పాయిజనింగ్ జరిగిన విషయం తెలిసిందే. దీంతో పలువురు విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారు. ఈ క్రమంలో మక్తల్ నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్ రెడ్డితో పాటు పలువురు బీఆర్ఎస్ నేతలను పోలీసులు అరెస్టు చేశారు. విద్యార్థులు, తల్లిదండ్రులకు మద్దతుగా బీఆర్ఎస్ నేతలు ఆందోళన నిర్వహించే అవకాశం ఉందనే అనుమానంతో బుధవారం తెల్లవారు నుంచే పోలీసులు అరెస్టులకు దిగారు. అరెస్టు చేసిన నాయకులను జిల్లాలోని వివిధ పోలీస్ స్టేషన్లకు తరలించారు. మాగనూరులో నిరసనలు, ఆందోళనలు జరుగకుండా ముందస్తు చర్యల్లో భాగంగా డీఎస్పీ లింగయ్య నేతృత్వంలో భారీగా పోలీసులను మోహరించారు. చిట్టెం రామ్మోహన్ రెడ్డి అక్రమ అరెస్టు నిరసిస్తూ బీఆర్ఎస్ నేతలు మక్తల్ జాతీయ రహదారిపై ఆందోళన చేపట్టగా.. వారిని పోలీసులు అరెస్టు చేశారు.

## ఫోన్ ట్యాపింగ్ కేసులో బెయిల్ కోసం పోలీసులు విశ్వ ప్రయత్నాలు

మొదటి పేజీ తరువాయి...

పిటిషన్ వేయగా.. అందుకు న్యాయస్థానం అంగీకరించలేదు. తిరపతన్నకు బెయిల్ రద్దు చేస్తూ హైకోర్టు తీర్పునిచ్చింది. అయితే హైకోర్టు బెయిల్ రద్దు చేయడాన్ని సవాల్ చేస్తూ ఆయన సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై గురువారం (అక్టోబర్ 24న) న్యాయస్థానం విచారణ చేసింది. జస్టిస్ బీవీ నాగరత్న , జస్టిస్ ఎన్ కోటీశ్వర్ సింగ్‌తో కూడిన ధర్మాసనం ఈ కేసును విచారించింది. ఈ కేసుకు సంబంధించి తెలంగాణ ప్రభుత్వానికి సుప్రీం కోర్టు నోటీసులు జారీ చేసింది. తెలంగాణ ప్రభుత్వం కౌంటర్ దాఖలు చేయాలని ఆదేశించింది. ఛార్జ్‌షీట్ ఫైల్ చేసి మూడు నెలలు అయిన తర్వాత కూడా హైకోర్టు బెయిల్ ఎందుకు నిరాకరించిందని ధర్మాసనం ప్రశ్నిస్తూ.. తరుపరి విచారణను నవంబర్ 27కు వాయిదా వేసింది. ఈరోజు విచారణ జరిపిన సుప్రీం కోర్టు తదుపరి డిసెంబర్ 18వ తేదీకి వాయిదా వేసింది. కాగా.. ఫోన్ ట్యాపింగ్ కేసులో నిందితుడిగా ఉన్న తిరుపతన్నకు ఇటీవల హైకోర్టు బెయిల్ రద్దు చేసిన విషయం తెలిసిందే. తిరుపతన్న దాఖలు చేసిన బెయిల్ పిటిషన్‌ను న్యాయస్థానం నిరాకరించింది. తిరుపతన్న ఫోన్ ట్యాపింగ్ చేసినట్లు ఆధారాలు ఉన్న నేపథ్యంలో బెయిల్ ఇవ్వలేమని స్పష్టం చేసింది. కేసు విచారణ కీలక దశలో ఉన్న సమయంలో బెయిల్ ఇస్తే... దాన్ని వల్ల దర్యాప్తుపై ప్రభావం పడే అవకాశం ఉంటుందని హైకోర్టుకు పోలీసులు తెలియజేశారు. పోలీసుల వాదనలతో హైకోర్టు ఏకీభవించింది. ఫోరెన్సిక్ ల్యాబరేటరీ నివేదిక ప్రకారం దర్యాప్తు చేయాలని ఖాకీలను కోర్టు ఆదేశించింది. అలాగే తిరుపతన్నకు బెయిల్ మంజూరు చేయలేమని స్పష్టం చేస్తూ.. ఈ కేసును హైకోర్టు ధర్మాసనం కొట్టివేసింది. దీంతో హైకోర్టును తీర్పును సవాల్ చేస్తూ తిరుపతన్న సుప్రీంను ఆశ్రయించారు.

## ఇస్రో శుక్రయాన్‌కు కేంద్రం గ్రీన్ సిగ్నల్

మొదటి పేజీ తరువాయి...

చేపట్టనున్నది. ఈ ప్రాజెక్టులో చంద్రుడిపై మట్టి, రాతి నమూనాలను సేకరించి తిరిగి భూమిపైకి చేరుకునేలా ప్రయోగం చేపట్టబోతున్నది. ఈ మిషన్‌కు కేంద్రం ఆమోదం తెలిపితే.. 2030 నాటికి మిషన్‌ను నిర్వహించగలుగనున్నట్లు నీలేశ్ దేశాయ్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మిషన్ శాస్త్రీయ ప్రాముఖ్యతను వివరించారు. మార్స్ ఆర్బిటర్ మిషన్ (మంగళ్‌యాన్) సాధించిన విజయాల ఆధారంగా ఇస్రో మార్స్ ప్రోగ్రామ్‌ను సైతం విస్తరిస్తున్నది. రాబోయే దశలో రెడ్ ప్లానెట్ చుట్టూ పరిభ్రమించడంతో పాటు ఉపరితలంపై ల్యాండింగ్‌కు ప్రయత్నించనున్నట్లు పేర్కొన్నారు. మార్స్ మిషన్‌లో ఓ ఉపగ్రహాన్ని అంగారకుడి కక్ష్యలో ఉంచడంతో పాటు ఉపరితలంపై ల్యాండింగ్‌కు ప్రయత్నాలు చేస్తామన్నారు. ఆ గ్రహంపై మరింత లోతుగా అధ్యయనం చేస్తామన్నారు. అలాగే, గగన్‌యాన్‌లో కీలకమైన మైలురాయిని చేరుకునేందుకు సిద్ధమవుతున్నట్లు తెలిపారు. తొలిసారిగా గగన్‌యాన్ ప్రాజెక్టులో భాగంగా ఆస్ట్రోనాట్స్‌ని అంతరిక్షంలోకి తీసుకువెళ్లనున్నది. రాబోయే రెండేళ్లలో మిషన్ చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. ఇన్‌శాట్-4ని భాగంగా వాతావరణ, సముద్రంపై పరిశోధనలను మెరుగుపరిచేందుకు కొత్త సెన్సార్లతు ఉపగ్రహాలను సిద్ధం చేయనున్నట్లు పేర్కొన్నారు. ఇన్‌శాట్-4 సిరీస్‌లో భాగంగా ప్రయోగించనున్న కొత్త సెన్సార్లు, ఉపగ్రహాలపై చర్చలు జరుపుతున్నామన్నారు. ఇక తొలిసారిగా అంతరిక్ష కేంద్రం ఏర్పాటుకు సంబంధించిన ప్రణాళికలకు సైతం కేంద్రం ఆమోదం తెలిపింది. ఇది ఐఎస్ఎస్ కంటే చిన్నగా ఉంటుంది. ఇస్రో స్పేస్ సెంటర్‌లో ఐదు మాడ్యూల్స్ ఉంటాయి. తొలి మాడ్యూల్ 2028లో ప్రారంభించనున్నారు. పూర్తి స్టేషన్ నిర్మాణం 2035 నాటికి అందుబాటులోకి వచ్చే అవకాశం ఉంటుందని ఆయన వివరించారు.

## ఆకర్షణీయమైన వేదికలుగా పర్యాటక కేంద్రాలు

### సాహస జల క్రీడల కోసం అభివృద్ధికి అడుగులు

### 34 జలవనరుల్లో స్పీడ్, హౌస్‌బోట్లు ఏర్పాటుకు చర్యలు

హైదరాబాద్, నవంబర్ 27 (ప్రభాత ఉదయం): తెలంగాణ రాష్ట్రంలోని నదుల బ్యాక్‌వాటర్లు, రిజర్వాయర్లు, చెరువులను సాహస జల క్రీడల కోసం ఆకర్షణీయమైన వేదికలుగా మారుస్తున్నట్లు పర్యాటక అభివృద్ధి సంస్థ ప్రకటించింది.ఈ లక్ష్యంతో, 34 జలవనరులను బోటు షికారు సేవలను అందుబాటులోకి తీసుకురావడానికి చర్యలు తీసుకుంటోంది.ప్రభుత్వ-ప్రైవేటు భాగస్వామ్య విధానంలో (పీపీపీ) ఈ కార్యక్రమాలను అమలు చేయడానికి ప్రణాళికలు రూపొందించినట్లు సమాచారం.మొదటగా, హైదరాబాద్‌లోని హుస్సేన్‌సాగర్, సోమశిలలోని కృష్ణా నది బ్యాక్‌వాటర్‌లలో సరికొత్త బోటింగ్ సేవలను అందుబాటులోకి తీసుకురానున్నట్లు సమాచారం. ఈ రెండు ప్రదేశాల్లో టెండర్ల ప్రక్రియ ముగిసిన తర్వాత, ప్రైవేటు సంస్థలతో ఒప్పందం కుదుర్చుకోవాలని భావిస్తున్నారు.డిసెంబరు 4నుంచి స్పీడ్ బోట్లు, ఇతర సాహస జలక్రీడలు ప్రారంభమయ్యే అవకాశం ఉన్నట్లు పర్యాటక అభివృద్ధి సంస్థ వర్గాలు తెలిపాయి. రాష్ట్రవ్యాప్తంగా జలపర్యాటకాన్ని ప్రోత్సహించేందుకు, పలు జిల్లాల్లో వాటర్ స్పోర్ట్స్ కార్యక్రమాలను ప్రవేశపెట్టేందుకు టూరిజం సంస్థ జలవనరులను ఎంపిక చేసింది.హుస్సేన్‌సాగర్, సోమశిల, కరీంనగర్ లోయర్‌మానేరు డ్యాం, రామప్ప చెరువు, లకారం, మధిర చెరువులు, నాగార్జునసాగర్‌లో కృష్ణా నది (హౌస్‌బోట్), బుద్ధవనం వద్ద కృష్ణా నది (హౌస్‌బోట్), గోదావరిఖని వద్ద గోదావరి నది, మహబూబ్‌నగర్, సిద్దిపేట కోమటిచెరువు, భద్రకాళి చెరువు, కోటిపల్లి రిజర్వాయర్, రంగనాయకసాగర్, కొండపోచమ్మ సాగర్, కడెం రిజర్వాయర్ వంటి వివిధ జలాశయాలను జాబితాలో చేర్చారు. ఈ ప్రదేశాల్లో స్పీడ్ బోట్లు, డీలక్స్ బోట్లు, హౌస్‌బోట్లు, అలాగే పర్యాటకులకు మరిన్ని సౌకర్యాలు అందించే ప్రణాళికలు ఉన్నాయి. ఖమ్మం జిల్లాలో మధిర వద్ద జలక్రీడలతో పాటు కాటేజీలు, రెస్టారెంట్లు, పిల్లలు ఆడుకునే పరికరాల ఏర్పాటు కోసం టెండర్లు పిలిచారు. సంగారెడ్డి జిల్లా సింగూరు రిజర్వాయర్‌లో 25-30 మంది ప్రయాణించేలా డీలక్స్ బోట్లు, కాటేజీలు, కెఫెటేరియా, ఓపెన్ జిమ్ వంటి సౌకర్యాలు అందుబాటులోకి రానున్నాయి. ఖమ్మం జిల్లాలో జమలాపురం చెరువు వద్ద కూడా పర్యాటకుల సౌకర్యాల కోసం టెండర్లు పిలిచారు. 20, 40 సీట్లతో బోట్లు, కాటేజీల నిర్మాణం చేపట్టేందుకు టెండర్లు ఏర్పాటు చేశారు.

# రాంబాగ్ శ్రీ అనంత పద్మనాభ స్వామి దేవాలయ భూములలో కబ్జాలను అడ్డుకున్న దేవాదాయ శాఖ అధికారులు



రాంబాగ్ శ్రీ అనంత పద్మనాభ స్వామి దేవాలయం స్థలంలో నిర్మించిన ప్రహరీ గోడ ను కూల్చి బోర్డు ఏర్పాటు చేస్తున్న ప్రైవేటు వ్యక్తులు



దేవాలయం భూమి అని చెబుతున్న రంగారెడ్డి జిల్లా దేవాదాయ ధర్మాదాయ శాఖ అసిస్టెంట్ కమీషనర్ శేఖర్

## ఆ స్థలం మాదేనంటు బోర్డులు పాతిన ప్రైవేటు వ్యక్తులు
## ప్రభుత్వం జోక్యం చేసుకుని దర్యాప్తు జరపాలంటున్న స్థానికులు

బుద్వేల్, నవంబరు27(ప్రభాత ఉదయం): అత్తాపూర్ రాంబాగ్ లోని శ్రీ అనంత పద్మనాభ స్వామీ దేవాలయం భూమిలో రెండు వేల గజాలలో నిర్మించిన ప్రహరీగోడ ను . ఒక వైపు కూల్చివేసి అందులో గేటు పెట్టారు కొందరు ప్రైవేటు వ్యక్తులు. ఆ స్థలం మా పేరున రాజేంద్రనగర్ రెవెన్యూ అధికారులు క్రమబద్ధీకరించారని చెప్పి బోర్డులు ఏర్పాటు చేశారు. విషయాన్ని తెలుసుకున్న రంగారెడ్డి జిల్లా దేవాదాయశాఖ అసిస్టెంట్ కమిషనర్ శేఖర్, సూపరిం టెండెంట్ మోహన్ తో పాటు పలువురు ఎండోమెంట్ అధికారులు బుధవారం సంఘటన స్థలానికి చేరుకుని అది దేవాదాయశాఖ స్థలం అని అక్కడ జరుగుతున్న పనులను స్థానికులతో కలసి ఆపివేయించారు. అనంతరం దేవాలయ స్థలం కబ్జా అవుతుందని, అత్తాపూర్ పోలీసులకు పిర్యాదు చేశారు. వివరాలలోకి వెళితే.. అత్తాపూర్ రాంబాగ్ లో సర్వే నెంబర్ 523లో 8.25 ఎకరాల భూమి శ్రీ అనంత పద్మనాభ స్వామీ దేవాలయం కు ఉంది. ఈ స్థలం దేవాదాయ శాఖ గెజిట్లో కూడా పొందు పరిచారు. ఇక్కడ మూడెకరాలలో దేవాలయం ఉండగా మిగతా భూమిలో కొలను ఉండగా, మరో మూడు వేల గజాల పరకు ఖాళీగా ఉంది. కాళీగా ఉన్న దేవాలయం స్థలంలో రెండు వేల గజాల స్థలంలో ప్రహరీగోడ నిర్మించారు. పీ ఎస్ రెడ్డి అనే వ్యక్తి సిరిమల్లె డెవలపర్ పేరుతో తాము ఆ స్థలాన్ని, హజారి తో కొన్నామని తెలిపాడు. ఆ తర్వాత, ఆ భూమి ప్రభుత్వానిదని తేలితే, దానిని జీవో నెంబర్ 166 ప్రకారం రిజిస్ట్రేషన్ చేసుకున్నామన్నారు. అందుకనే బుధవారం పది మంది మనుషులను పెట్టి ప్రహరీలో కొంత బాగం కూల్చి వేసి.. గేటు పెట్టి బోర్డు పాతామన్నారు.

**ఖాళీగా ఉన్న దేవాలయ స్థలాన్ని ఎలా క్రమబద్ధీకరిస్తారు ?**

అత్తాపూర్ రాంబాగ్ శ్రీ అనంత పద్మనాభ స్వామీ దేవాలయ భూమిని రాజేంద్రనగర్ తహసీల్దార్ కార్యాలయం అధికారులు ప్రైవేటు వ్యక్తులకు ఎలా జీవో నెంబరు 166 ప్రకారం క్రమబద్ధీకరించారని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. ఒక వేళ జీవో నెంబర్ 166 ప్రకారం ప్రభుత్వ స్థలాన్ని క్రమబద్ధీకరించాలన్నా, ఆ స్థలంలో అప్పటికే నిర్మాణాలు ఉండాలని, అక్కడ ఎలాంటి నిర్మాణాలు లేవని గుర్తు చేస్తున్నారు. దానికి రంగారెడ్డి జిల్లా జాయింట్ కలెక్టర్ ఎలా స్థలం ప్రైవేటు వ్యక్తులదని తేల్చాడో అర్థం కావడం లేదని అంటున్నారు. ఈ వ్యవహారంపై ఉన్నత స్థాయి దర్యాప్తు జరిపించాలని కోరుతున్నారు.

**తాము రెండు సార్లు కొనుగోలు చేశాం : పీఎస్ రెడ్డి**

సర్వే నెంబర్ 523 లో గల స్థలంలో సుమారు రెండు వేల గజాల స్థలం వరకు తాము మొదట పూజారి నుంచి కొనుగోలు చేశాం. సిరిమల్లె డవలపర్స్ పేరుతో ఈ కొనుగోలు జరిగింది. తర్వాత అది ప్రభుత్వ పోరంబోకు అని తేలితే ప్రభుత్వానికి డబ్బులు కట్టి జీవో నెంబరు 166 ప్రకారం క్రమబద్ధీకరించుకున్నాం. తాము దేవాదాయ శాఖకు చెందిన స్థలం కబ్జా చేయడం లేదు.

**సర్వే నెంబర్ 523 లో క్రమబద్ధీకరించిన స్థలాలు ప్రైవేటు వ్యక్తులవే: తహసీల్దార్ బిరాములు :**

2008 కంటే ముందే రంగారెడ్డి జిల్లా జాయింట్ కలెక్టర్ సర్వే నెంబర్ 523 లో గల కొన్ని స్థలాలను ప్రైవేటు వ్యక్తులవని తేల్చాడని రాజేంద్రనగర్ తహసీల్దార్ బి.రాములు తెలిపారు. దానిపై వారికి జీవో నెంబర్ 166 ప్రకారం కన్వీనియన్ డీడ్ కూడా చేయడం జరిగింది. ఒక్కొక్కరి పేరున ఐదు వందల గజాల చొప్పున పలుపురి పేర్లపై- అక్కడి స్థలాలను క్రమబద్ధీకరించాం. అక్కడ నిర్మాణాలు లేకున్నా అప్పట్లో స్థలాలను క్రమబద్ధీకరించారు. కాబట్టి అవి దేవాలయ భూములు కావని ప్రైవేటు వ్యక్తుల భూములేనని తహసీల్దార్ బి. రాములు వివరిం చారు.

**ప్రభుత్వం జోక్యం చేసుకోవాలి.**

రాంబాగ్‌లో దేవాలయం భూములు ఎక్కువగా ఉన్నాయి. ఇప్పటికే కొన్ని భూములు 90 సంవత్సరాల లీజుల పేరుతో, కొన్ని భూములు 33 సంవత్సరాల లీజుల పేరుతో ప్రైవేటు వ్యక్తుల చేతుల్లో ఉన్నాయి. నగరానికి అతి దగ్గరలో ఉన్న రాంబాగ్ దేవాలయ భూములపై ప్రభుత్వం స్పందించి భూములను కాపాడాలని అత్తాహర్ కార్పొరేటర్ మొంద్ర సంగీత గౌరీశంకర్ కోరారు.



ఉపాధ్యాయులతో విద్యార్థి టి.రాహుల్


## రాష్ట్ర స్థాయి హాకీ క్రీడలకు ఎంపికైన విద్యార్థి టి.రాహుల్

గద్వాల జిల్లా ప్రతినిధి, నవంబర్ 27(ప్రభాత ఉదయం)గద్వాల పట్టణంలోని ప్రభుత్వ అభ్యసన ఉన్నత పాఠశాలకు చెందిన టి.రాహుల్ అనే క్రీడాకారుడు రాష్ట్ర స్థాయి హాకీ పోటీలకు ఎంపికయ్యారని ప్రధానోపాధ్యాయులు డి.వెంకట్ నర్సయ్య తెలిపారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ అండర్ -14 హాకీ విభాగంలోగద్వాలకు చెందిన టి.రాహుల్ ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లా హాకీ జట్టుకు ఎంపికయ్యాడు. నవంబర్ 29 నుంచి డిసెంబర్ 1 తేదీల్లో హుజురాబాద్ లో జరుగు అండర్ -14 రాష్ట్ర స్థాయి హాకీ పోటీలలో ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లా జట్టు నుంచి రాహుల్ హాకీ క్రీడలలో ఆడనున్నట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా హాకీ క్రీడాకారుని ప్రధానోపాధ్యాయులతో పాటు, పీఈటీ నరేష్, ఉపాధ్యాయులు అభినందించారు.

## మూసీ నదిలో రసాయన వ్యర్థాలను వదులుతున్న సంఘటనలో ముగ్గురిపై కేసు నమోదు

బుద్వేల్, నవంబరు27 (ప్రభాత ఉదయం) బాపూఘాట్- హైదర్ గూడ సంగమం వద్ద మూసీలోకి రసాయన వ్యర్థాలను పైపులైన్ వేసి మరీ వదులుతున్న సంఘటనలో రాజేంద్రనగర్ పోలీసులు పలువురిపై కేసులు నమోదు చేశారు. ఆ స్థలం లీజుకు తీసుకుని నడుపుతున్న చం ద్రశేఖర్, కెమికల్ ట్యాంకర్ యజమాని వెంకటేశ్, డ్రైవర్ దేవదాసు లపై కేసులు నమోదు చేసినట్లు రాజేంద్రనగర్ ఎస్ఐ భానుమతి తెలిపారు. మూసీలోకి రసాయన వ్యర్థాలను వదులుతుండటాన్ని గమనించిన లంగర్ హౌజ్ కు చెందిన అయ్యప్ప స్వామీ భక్తులు ఇం ద్రసేనారెడ్డి తదితరులు మంగళవారం రాజేంద్రనగర్ పోలీసులకు పిర్యాదు. చేసిన సంగతి తెలిసిందే. దానిపై విచారణ చేస్తున్న రాజేంద్రనగర్ పోలీసులు కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. రసాయన వ్యర్థాల ట్యాంకర్ ను పీసీబీ అధికారులు స్వాధీనం చేసుపని పరీక్షల నిమిత్తం ల్యాబ్ కు పంపించారు. పోలీసుల కేసు ఆధారంగా రసాయన వ్యర్థాలను ఎక్కడి నుంచి తీసుకువచ్చారో అని తేలితే ఆ పరిశ్రమ పై పరిశ్రమల శాఖ చర్యలు తీసుకునే అవకాశం ఉంటుందని పీసీబీ అధికారులు తెలిపారు.

## నేడు మహాత్మా జ్యోతిరావు పూలే వర్ధంతి



మహాత్మా జ్యోతిరావు పూలే

బుద్వేల్, నవంబరు27(ప్రభాత ఉదయం): ఈ నెల 28న ఉదయం 9 గంటలకు మహాత్మా జ్యోతిరావు పూలే వర్ధంతి కార్యక్రమాన్ని రాజేంద్రనగర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల ముందు గల ఆయన విగ్రహం వద్ద నిర్వహించనున్నట్లు జ్యోతిరావు పూలే జయంతి ఉత్సవాల కమిటీ ప్రతనిధులు ఓ ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమంలో రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి.ప్రకాశ్ గౌడ్, బీఆర్ఎస్ నాయకులు పి.కార్తీకరెడ్డి, కార్పొరేటర్లు తోకల శ్రీనివాస్రెడ్డి. పి.అర్చన జయప్రకాశ్, మోంద్ర సంగీత గౌరీశంకర్ తో పాటు వివిధ పార్టీల నాయకులు పాల్గొంటారని నిర్వాహకులు కె. క్రిష్ణమాచారి, అడికె అర్జున్, బిక్షపతి, కోళ్లమీది యాదయ్య ముదిరాజ్, కె.రముగౌడ్, డి.సత్యనారాయణ ముదిరాజ్, కె.సత్యనారాయణగౌడ్, పుంజాల శ్రీనివాస్ గౌడ్ లు తెలిపారు.

**బీఆర్ఎస్ నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలి : కొలన్ సుభాష్ రెడ్డి**

గురువారం ఉదయం 9 గంటల నుంచి జరిగే మహాత్మ జ్యోతిరావు పూలే వర్ధంతి కార్యక్రమంలో బీఆర్ఎస్ యువ నాయకులు పట్లోళ్ల కార్తిక్ రెడ్డి పాల్గొంటున్న సందర్భంగా పార్టీ నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని ఆ పార్టీ నాయకుడు కొలన్ సుభాష్ రెడ్డి అన్నారు.

## శివరాంపల్లి సర్వేనెంబర్ 23లో 500 గజాల ప్రభుత్వ స్థలం కబ్జాపై
# హైడ్రా కమిషనర్‌కు ఫిర్యాదు

బుద్వేల్, నవంబరు27 (ప్రభాత ఉదయం): శివరాంపల్లి సర్వే నెంబర్ 23లో 500 గజాల వరకు కబ్జా చేసిన సాంబ అంజనేయులు అనే వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని కోరుతు బుధవారం అదే బస్తీకి చెందిన ఎం. ప్రభాకర్ రెడ్డి, పి.జీవన్ దాస్ , నాగని సురేశ్ లు హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ ను ఆయన కార్యాలయంలో కలని ఫిర్యాదు చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ, శివరాంపల్లిలో ప్రభుత్వ స్థలం కబ్జా అయిందని రాజేంద్రనగర్ తహసీల్దార్, రం గారెడ్డి జిల్లా కలెక్టర్ కు పలు మార్లు లిఖిత పూర్వకంగా పిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదన్నారు. సాంబ అం జనేయులు ఎన్. సంధ్య పేరుతో 2015లో 244 గజాలు, 2016లో 169 గజాల ప్రభుత్వ స్థలాలను ఆక్రమించి క్రమబద్ధీకరించుకున్నాడన్నారు. అదే కాకుండ మరో 500 గజాల ప్రభుత్వ స్థలాన్ని కూడా సాంబ అంజనేయులు ఆక్రమించుకుని ప్రహరీగోడ నిర్మాణం చేశాడన్నారు. ఈ స్థలాలపై పూర్తి స్థాయి విచారణ చేసి సాంబ అంజనేయ లు స్వాధీనం లో ఆయన క్రమబద్ధీకరించుకున్న స్థలం కంటే ఎక్కువ స్థలం ఉంటే దానిని అంగన్వాడీ కేంద్రానికైన. పాఠశాలకైన, కమ్యూనిటీ హాల్ భవనానికైన కేటాయించాలని కోరారు. ఇదే విషయమై రాజేంద్రనగర్ తహసీల్దార్ బి.రాములు కు ఐదు సార్లు ఏర్యాదు చేసినా ఆయన స్పందించడం లేదన్నారు. దీనిపై హైడ్రా కమిషనర్ స్పందించి సాంబ అంజనేయులు స్వాధీనంలో ఉన్న స్థలం ఆయన క్రమబద్ధీకరించుకున్న స్థలం కంటే ఎక్కువగా ఉంటే దానిని తీసుకుని ప్రజా ప్రయోజనాల కోసం ఉపయోగించాలన్నారు.

# పింఛన్ కోసం వృద్ధులు పడిగాపులు

**నాటి ప్రభుత్వంలో ఠంఛన్ వచ్చేది..**

**కాంగ్రెస్ హయాంలో 20 దాటినా రాని పరిస్థితి**

**ట్విటర్ వేదికగా విమర్శలు గుప్పించిన మాజీ మంత్రి కేటీఆర్**



హైదరాబాద్, నవంబర్ 27 (ప్రభాత ఉదయం): మాజీ సీఎం కేసీఆర్ పాలనలో వృద్ధులు ఎవరి మీద ఆధారపడకుండా మందు బిళ్లలు, ఇంటి నిత్యావసరాలు పింఛన్ డబ్బులతో తెచ్చుకునేవారని, కానీ కాంగ్రెస్ పాలనలో అది సాధ్యం కావడం లేదని మాజీ మంత్రి కేటీఆర్ అన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ఏలుబడిలో వృద్ధులు పింఛన్ల కోసం పడిగాపులు పడుతున్నారన్నారు. నెలానెలా సరైన సమయంలో పింఛన్లు ఇవ్వకపోవడంతో వృద్ధులు, వికలాంగులు తీవ్ర ఇబ్బందులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని పేర్కొన్నారు. ఈ క్రమంలో నిత్యం ఎక్కడో చోట పింఛన్ల కోసం రోడ్డెక్కుతున్న ప్రభుత్వానికి పట్టడం లేదని విమర్శించారు. నారాయణపేట జిల్లా ధన్వాడ మండల కేంద్రంలో పింఛన్ వృద్ధులు రోడ్డెక్కి వెంటనే పింఛన్లు ఇవ్వాలని డిమాండ్ చేశారని గుర్తు చేశారు. కేసీఆర్ సీఎంగా ఉన్న సమయంలో నెలనెలా సక్రమంగా పింఛన్ వచ్చేదని.. కాంగ్రెస్ ప్రభుత్వం అధి కారంలోకి వచ్చినంక పింఛన్ డబ్బుల కోసం ఎదురుచూడాల్సి వస్తుందని వాపోయారు. 18 నుంచి 20వ తేదీలోగా పోస్టాఫీసుల్లో ఇచ్చేవారని.. నవంబర్ 25వ తేదీ వచ్చినా ఇంకా డబ్బులు ఇవ్వలేదంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. రెండురోజుల్లోనే వచ్చేలా చూస్తామని పోలీసులు హామీ ఇవ్వడంతో వృద్ధులు శాంతించారు. తెలంగాణాలో పింఛన్ల కోసం కోసం వృద్దులు రోడ్డెక్కుతారని ఎవరు అనుకున్నారు.. టంచన్‌గా అకౌంట్లో పడే పడే పైసలు ఆగిపోతాయని ఎవరునుకున్నారు? అన్నారు. మూసీ బ్యూటిఫికేషన్ కోసం లాక్షా యాభై వేల కోట్లు వెదజల్లి.. కనికరం లేకుండా వృద్ధుల పెన్షన్ డబ్బులను ఆపుతారని అనుకున్నారన్నారు. మందుబిల్లల కోసం కొడుకులు, కోడళ్ల దగ్గర చేయిచాచే అవసరమే లేని రోజుల నుంచి మళ్లీ వేడుకునే 'మార్పు' వస్తుందని ఎవరు ఊహించారని.. అణువణువునా కర్కశత్వాన్ని నింపుకున్న ఇందిరమ్మ రాజ్యంలో ఇంటింటా ఇక్కట్లే ఉంటాయని ఎవరనుకున్నారు..? మార్పు ఇంత మోసగిస్తుందని ఎవరనుకున్నారు? అంటూ 'ఎక్స్' (ట్విట్టర్)లో పోస్ట్ పెట్టారు.

## మక్తల్‌లో పోలీసులు అత్యుత్సాహం
### బీఆర్ఎస్ నేతలను అరెస్టు చేసిన పోలీసులు

హైదరాబాద్, నవంబర్ 27 (ప్రభాత ఉదయం): మక్తల్‌లో పోలీసులు అత్యుత్సాహం ప్రదర్శిస్తున్నారు. మాగనూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల సందర్శనకు వెళ్తారనే అనుమానంతో బుధవారం తెల్లవారు జామున మాజీ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డితో పాటు పలువురు బీఆర్ఎస్ నేతలను పోలీసులు అరెస్ట్ చేశారు. పోలీసులు నియోజకవర్గవ్యాప్తంగా వివిధ మండలాలకు చెందిన నేతలను అరెస్టు చేసి జిల్లాలోని వివిధ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. మక్తల్ మాజీ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్ రెడ్డిని మద్దూర్ పోలీస్ స్టేషన్‌కు నారాయణపేట పోలీసులు తరలించారు. మాగనూరు జడ్పీ ఉన్నత పాఠశాలలో ఫుడ్ ఫాయిజన్‌తో విద్యార్థులు అవస్థతకు గురయ్యారు. ప్రస్తుతం వారు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఈ క్రమంలో మాజీ ఎమ్మెల్యే ఆధ్వర్యంలో విద్యార్థులు, తల్లిదండ్రులకు మద్దతుగా బీఆర్ఎస్ నేతలు ఆందోళన నిర్వహించే అవకాశం ఉందనే అనుమానంతో బుధవారం తెల్లవారు నుంచే పోలీసులు అరెస్టులకు దిగారు. అరెస్టు చేసిన నాయకులను జిల్లాలోని వివిధ పోలీస్ స్టేషన్లకు తరలిస్తున్నారు. మాగనూరులో నిరసనలు, ఆందోళనలు జరుగకుండా ముందస్తు చర్యల్లో భాగంగా డీఎస్పీ లింగయ్య నేతృత్వంలో భారీగా పోలీసులను మోహరించారు. చిట్టెం రామ్మోహన్ రెడ్డి అక్రమ అరెస్టు నిరసిస్తూ బీఆర్ఎస్ నేతలు మక్తల్ జాతీయ రహదారిపై ఆందోళన చేపట్టారు. వారిని పోలీసులు బలవంతంగా పోలీసులు అరెస్టు చేసి.. ఠాణాకు తరలించారు. పోలీసుల అత్యుత్సాహంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

## సీఎం పదవి దక్కకపోతే.. ప్లాన్ బీ అమలు
### ప్రయత్నాలు ముమ్మరం చేసిన షిండే వర్గం

ముంబై, నవంబర్ 27 (ప్రభాత ఉదయం): మహారాష్ట్ర తదుపరి ముఖ్యమంత్రి ఎవరన్నది ఇంకా తేలలేదు. నాలుగు రోజులుగా ఈ అంశంపై తీవ్రంగా చర్చ నడుస్తోంది. గత శాసనసభ గడువు మంగళవారంతో ముగిసినప్పటికీ కొత్త ప్రభుత్వ ఏర్పాటుపై మహారాష్ట్రలో ఇంకా స్పష్టత రాలేదు. ముఖ్యమంత్రిగా ఎవరు బాధ్యతలు చేపట్టాలన్నదానిపై సందిగ్ధత కొనసాగుతోంది. ఓవైపు బీజేపీ అత్యధిక సీట్లు గెలుచుకున్న నేపథ్యంలో తమ నాయకుడు దేవేంద్ర ఫడ్నవీస్‌కు ముఖ్యమంత్రి పదవిని అప్పగించాలని ఆ పార్టీ నేతలు కోరుతున్నారు. మరోవైపు.. షిండే నాయకత్వంలోనే ఈ ఎన్నికల్లో తమ కూటమి గెలుపొందినందున ఏక్‌నాథ్ షిండేనే ముఖ్యమంత్రిగా కొనసాగించాలని శివసేన కార్యకర్తలు కోరుతున్నారు. ఈ నేపథ్యంలో ఆసక్తికర విషయం ఒకటి ఇప్పుడు వెలుగులోకి వచ్చింది. సీఎం పదవి దక్కని పక్షంలో షిండే వర్గం ప్లాబ్-బీని సిద్ధం చేసుకున్నట్లు తెలిసింది. ఏక్‌నాథ్ షిండేని ముఖ్యమంత్రిని చేయకపోతే.. హోంశాఖ ఇవ్వాల్సిందిగా డిమాండ్ చేసినట్లు సమాచారం. మంగళవారం అర్ధరాత్రి దేవేంద్ర ఫడ్నవీస్‌తో షిండే వర్గం నేతలు జరిపిన సమావేశంలో ఈ డిమాండ్‌ను ప్రస్తావించినట్లు తెలిసింది. ఈ మేరకు సంబంధిత వర్గాలను ఉటంకిస్తూ జాతీయ మీడియాలో వరుస కథనాలు వస్తున్నాయి. దీంతోపాటు మరికొన్ని వార్తలు కూడా ప్రచారంలో ఉన్నాయి. రెండు రోజుల క్రితం దేవేంద్ర ఫడ్నవీస్‌కు జాతీయ స్థాయిలో కీలక పదవి వస్తుందని ప్రచారం జరిగింది. తాజాగా మరో అప్‌డేట్ బయటకు వచ్చింది. ఫడ్నవీస్‌ను ముఖ్యమంత్రిని చేసి ఏక్‌నాథ్ షిండేను కేంద్రమంత్రిగా, ఆయన కుమారుడు శ్రీకాంత్ షిండేను మహారాష్ట్ర ఉప ముఖ్యమంత్రిగా చేస్తారని ప్రచారం జరుగుతున్నది. మరొక ఉప ముఖ్యమంత్రిగా అజిత్ పవార్‌ను ప్రతిపాదించినట్లు సమాచారం. ఈ ఫార్ములా ద్వారా మూడు పార్టీలనూ ఆకర్షించేందుకు బీజేపీ ప్రయత్నిస్తున్నదని అంటున్నారు. ఇది షిండే గౌరవాన్ని తక్కువ చేయదని, ఈ విషయం తేలికగా పరిష్కారమవుతుందని బీజేపీ భావిస్తున్నది. అయితే షిండే ముఖ్యమంత్రి కావాలని శివసేన నేతలు గట్టిగా ఒత్తిడి తెస్తున్నారని కూడా చెబుతున్నారు.

4 గురువారం 28 నవంబర్ 2024

జనరల్ న్యూస్ GENERAL NEWS

ప్రభాత ఉదయం

# జీతభత్యాలు రాక ఆర్థికంగా నలిగిపోతున్న 1962 సిబ్బంది

**రోజురోజుకు కుటుంబ పోషణ భారం**

**అరకొర జీతమే సమయానికి రావు**

**మూగ జీవాల సేవల్లో ప్రథమం జీతాల్లో అధమం**

**1962 సిబ్బందిని పట్టించుకోని ప్రభుత్వం**

గద్వాల జిల్లా ప్రతినిధి,నవంబర్ 27(ప్రభాత ఉదయం) 1962 వారు మూగజీవాల బాధను అర్థం చేసుకొని చికిత్స చేసే సేవకులు, మూగజీవాలకు ఏ చిన్న ఆపద వచ్చిన ఒక్క ఫోన్ కాల్ తో క్షేత్రస్థాయికి వచ్చి చికిత్స అందించే నిపుణులు అలాంటి సిబ్బందికి సమయానికి జీతాలు రాక ఆర్థిక భారంతో కొట్టుమిట్టాడుతున్నారు. 2017 వ సంవత్సరం నుండి తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మంగా ప్రవేశపెట్టిన 1962 పశు సంచార వాహన సేవలను రాష్ట్రంలోని ప్రతి నియోజక వర్గంలో ఏర్పాటు చేసిన100 వాహనాలు క్షేత్రస్థాయిలో మూగజీవాలకు సేవలు అందిస్తూ పాడి రైతు ప్రజల నుండి ప్రశంసలు అందుకున్నారు. ఈ ప్రశంసలు సేవల వరకే పరిమితమయ్యాయే తప్పా వారి కష్టాలను తీర్చలేకపోయాయి. వివరాల్లోకి వెళితే తెలంగాణ ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఈ పథకం ద్వారా 100 వాహనాల్లో పనిచేస్తున్న పశు వైద్యాధికారి, పారావెట్ పైలెట్, హెల్పర్ లకు ఈఎంఆర్ అనే సంస్థ నడిపిస్తున్నా సకాలంలో ప్రభుత్వం నుండి నిధులు మంజూరు అయితే తప్ప సిబ్బందికి జీతాలు ఇవ్వలేని పరిస్థితి నెలకొంది.గత కొన్ని నెలలుగాప్రభుత్వం నిధులు మంజూరు చేయకపోవడంతోఉద్యోగుల కుటుంబం పోషణ భారమైందని ఉద్యోగులు అందువలన వ్యక్తం చేస్తున్నారు. ఈ ఎన్ఆర్ఐ అనే సంస్థ సిబ్బందికి నిధులు సర్దుబాటు చేసిన ప్రభుత్వం నుండి నిధులు విడుదల కాకపోవడంతో బకాయి పడ్డ జీతాలు ఇవ్వలేని పరిస్థితి నెలకొంది. 1962వాహనాల మందుకుడా నిండుకోవడం క్షేత్రస్థాయిలో మూగజీవుల అందలేదని పరిస్థితి వచ్చిందనిఆ సిబ్బంది వాపోతున్నారు. ఈ సమస్య ప్రభుత్వం వెంటనే తీర్చాలని జోగులాంబ గద్వాల్ జిల్లా సిబ్బంది డిమాండ్ చేశారు.




పశు వైద్య సంచార సిబ్బంది



ప్రమాణ స్వీకారానికి వెళ్తున్నచింతలపల్లి నరసింహులు

# షాద్ నగర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్‌గా చింతలపల్లి నర్సింలు

## అట్టహాసంగా షాద్నగర్ మార్కెట్ కమిటీ ప్రమాణ స్వీకరణ

నవంబర్ 27,(ప్రభాత ఉదయం) మధ్యతరగతి కుటుంబంలో నుంచి అంచలంచలుగా ఎదిగి షాద్ నగర్ మార్కెట్ డైరెక్టర్ గా నియమితులైన చింతలపల్లి నర్సింలు ఆనందం అవధులు దాటింది. బుధవారం షాద్ నగర్ పట్టణంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీస్ నుండి వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యాలయంలో నిర్వహించిన ప్రమాణ స్వీకారోత్సవానికి భారీ ర్యాలీతో తరలి వెళ్లారు.పార్టీలో చురుకైన కార్యకర్తగా పనిచేస్తూ పార్టీ బలోపేతంలో తన వంతు కృషి చేసి పార్టీలో మంచి గుర్తింపు పొంది, వివాదరహితునిగా పేరొందిన నరసింహులుకు డైరెక్టర్ వరించడంతో తన అనుచర వర్గీయులతో సీఎం రేవంత్ రెడ్డి జిందాబాద్.. ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ నాయకత్వం వర్ధిల్లాలంటూ.. కార్యకర్తలు అభిమానులు భారీ నినాదాలు చేస్తూ ప్రమాణ స్వీకారోత్సవానికి ర్యాలీగా వెళ్లారు.



# ఈవీయంలు అత్యంత సురక్షితమైనవిగా సుప్రీంకోర్టు తీర్పు

## జిల్లా ఎన్నికల అధికారి.. బి. ఎం. సంతోష్

గద్వాల జిల్లా ప్రతినిధి, నవంబర్ 27(ప్రభాత ఉదయం) భారతదేశంలో ఎన్నికల నిర్వహణకు వినియోగించే ఈవీయంలు అత్యంత సురక్షితమైనవిగా అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు తీర్పును ఇచ్చినట్లు జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ బి.ఎం. సంతోష్ నేడు ఒక ప్రకటనలో తెలియజేశారు.ఈవియంలను ట్యాంపరింగ్ చేయొచ్చని పేర్కొంటూ మళ్ళీ బ్యాలెట్ పేపర్లకు అమల్లోకి తేవాలని కోరుతూ కొందరు వ్యక్తులు ఇటీవల సుప్రీం కోర్టులో ప్రజా ప్రయోజన వ్యాజ్యం దాఖలు చేశారని, పిల్ ను పరిశీలించిన సుప్రీంకోర్టు ధర్మాసనం కేసును కొట్టి వేస్తున్నట్టు తీర్పులు వెలువరించారని జిల్లా ఎన్నికల అధికారి తెలిపారు. సుప్రీం కోర్టు న్యాయమూర్తులు విక్రమ్ నాథ్, పి.బి. వరాలే ఈ అంశంపై విచారణ జరిపిన అనంతరం పిటిషన్ ను కొట్టివేస్తూ సంచలన తీర్పును వెలువరించారన్నారు. నాయకులు ఎన్నికల్లో గెలిచినప్పుడు ఈవీఎంలు కరెక్ట్ అని చెప్పడం, ఓటమి పాలైనప్పుడు మాత్రం ఈవీఎంలపై అనుమానాలు వ్యక్తపరచడం సరికాదని న్యాయస్థానం పేర్కొన్నట్లు తెలియజేశారు. ఈ తీర్పు ఈవీఎంల విశ్వాసనీయతకు మద్దతుగా, ఎన్నికల ప్రక్రియ పారదర్శకంగా జరుగుతుందనడానికి రుజువుగా నిలుస్తుందని కలెక్టర్ తెలిపారు. ఓటర్లు అందరూ ఎన్నికల ప్రక్రియ, భారత ఎన్నికల సంఘంపై నమ్మకం కలిగి ప్రజాస్వామ్య బద్ధంగా నిర్వహించే ఎన్నికలలో చురుకుగా పాల్గొనాలని ఆయన కోరారు.



ఎన్ సి సి వార్షికోత్సవంలో విద్యార్థులతో కలెక్టర్ సంతోష్

# విద్యార్థులు ఉత్తమ పౌరులుగా ఎదగాలి: జిల్లా కలెక్టర్ బియం సంతోష్

గద్వాల జిల్లా ప్రతినిధి, నవంబర్ 27(ప్రభాత ఉదయం)విద్యార్థులు విద్యతో పాటు క్రమశిక్షణ, సామాజిక సేవ కలిగి ఉత్తమ పౌరులుగా ఎదగాలని జిల్లా కలెక్టర్ బియం సంతోష్ అన్నారు. మంగళవారం గద్వాల పట్టణంలోని ప్రభుత్వ అభ్యసన ఉన్నత పాఠశాలలో 77వ ఎన్ సి సి వార్షిక దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జిల్లా కలెక్టర్ బి. ఎం.సంతోష్ హాజరయ్యారు. ఎన్ సి సి విద్యార్థులను కవాతు, గౌరవ వందనంతో జిల్లా కలెక్టర్ బి.యం.సంతోష్, ఇంచార్జ్ విద్యాశాఖ అధికారి కాంతమ్మకు ఘన స్వాగతం పలికి అతిథులను ఆహ్వానించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోనే అత్యధిక విద్యార్థిని విద్యార్థులలు కలిగిన పాఠశాల అని, ఈ విద్యా సంవత్సరంలో నూతనంగా ఎన్ సి సి యూనిట్లు ప్రారంభించుకోవడం జరిగిందని అన్నారు. విద్యార్థులకు క్రమశిక్షణతో కూడిన విద్యతో పాటు సామాజిక సేవలో భాగస్వాములు అయ్యేలా తయారు చేయడానికి ఉపాధ్యాయులు అందరూ కృషి చేయాలని అన్నారు. సామాజిక సేవా కార్యక్రమాలలో ఎన్ సి సి విద్యార్థుల పాత్ర చాలా గొప్పదని చదువుతో పాటు చక్కటి క్రమశిక్షణ గల ఉత్తమ పౌరులుగా ఎదగాలని ఆకాంక్షించారు. ఎన్ సి సి ఏర్పాటు యొక్క ముఖ్య ఉద్దేశం దేశ రక్షణలో భాగంగా త్రివిధ దళాలకు అనుబంధంగా పాఠశాల స్థాయిలో యూనిట్లను ఏర్పాటు చేసి వారికి కర్తవ్యం, ఐక్యమత్యం, క్రమశిక్షణ కలిగిన పౌరులుగా తీర్చిదిద్ది దేశ సంఘటిత శక్తులలో ఒకటిగా ఉండటానికి కృషి చేయాలని, యుద్ధ సమయాలలో రెండవ రక్షణ శ్రేణిగా సేవలు అందించడం మరియు వారి స్ఫూర్తిని ఆదర్శంగా తీసుకుని మీరు కూడా జీవితంలో ఉత్తమ పౌరులుగా తయారై సమాజాభివృద్ధికి తోడ్పడాలని ఆయన సూచించారు. మీ లక్ష్యాలను మరవకుండా నిరంతరం సాధనతో విజేతలు కావాలని ఆయన ఆకాంక్షించారు. అదేవిధంగా ఇంటర్ డిగ్రీ కాలేజీలలో కూడా ఎన్ సి సి యూనిట్లను ప్రారంభించాలని విద్యార్థులందరూ అందులో పాల్గొనేటట్లు చూడాలని ఆయన అన్నారు. మీకు భవిష్యత్ లో ఎన్ సి సి కోట కింద ఉద్యోగ అవకాశాలు కూడా ఉంటాయని ఆయన తెలిపారు. ఈ సందర్భంగా అమ్మ ఆదర్శ పాఠశాల పథకం కింద మరుగుదొడ్లకు గాను లక్ష రూపాయలు మంజూరు చేసినట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు వెంకట నరసయ్య, సి టీ ఓ రాముడు, రిటైర్డ్ ప్రధాన ఉపాధ్యాయులు, పూర్వపు ఎన్ సి సి ఆఫీసర్లు, సెక్యూరిటీ ఆఫీసర్, వివిధ పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.




విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగిస్తున్న కలెక్టర్ సంతోష్

# శ్రీ జమ్ములమ్మ ఆలయంలో టెంకాయల వేలం పాట

గద్వాల జిల్లా ప్రతినిధి, నవంబర్ 27(ప్రభాత ఉదయం)గద్వాల పట్టణ పరిధిలోని జమ్మిచేడులోని శ్రీశ్రీశ్రీ జమ్ములమ్మ మరియు పరుశురామ స్వామి దేవస్థానం నందు బుధవారం టెంకాయలు, లడ్డుప్రసాదాల విక్రయాలు, కొబ్బరి చిప్పల సేకరణకు వేలంపాట నిర్వహించారు. దేవాదాయ ధర్మాదాయ శాఖ గద్వాల డివిజన్ పర్యవేక్షణాధికారిణి వెంకటేశ్వరి,ఆలయ కార్యనిర్వాహణాధికారి ఆర్.పురెంధర్ కుమార్ పర్యవేక్షణలో నిర్వహించిన వేలంపాటలో టెండర్లలో పాల్గొనేందుకు వివిధ ప్రాంతాలకు చెందిన వ్యక్తులు భారీగా తరలివచ్చారు. 2025 సంవత్సరమునకు టెంకాయలు విక్రయించడానికి వేలం పాటలో ఏడుగురు సభ్యులు డిపాజిట్ దారులు పాల్గొన్నగా రూ.50,04,000 పులిపాటి నాగేష్ దక్కించుకున్నారు. గత సంవత్సరం కంటే ఈ సంవత్సరం రూ.5,69,000 ఆలయానికి ఆదాయం వచ్చింది. కొబ్బరి చిప్పల సేకరణకు గాను 11 మంది డిపాజిట్ దారులు వేలం పాటలో పాల్గొన్నగా రావూరి ఓం ప్రకాష్ కాంబ్లే రూ.12,22,000 దక్కించుకోవడంతో రూ. 5,55,000 ఆలయానికి ఆదాయం వచ్చింది. మొదటిసారిగా దేవస్థానామునకు సంబంధించి ఆలయం నందు అమ్మవారి చీరల సేకరణ , విక్రయాల వేలంపాటలో ఏడుగురు డిపాజిట్ దారులు వేలంపాటలో పాల్గొనగా వీరిలో ఓం ప్రకాష్ కాంబ్లే రూ. 3,54,000 దక్కించుకున్నారు. దేవస్థాన ప్రాంగణం యందు లడ్డు పులిహోర, ప్రసాదాల విక్రయాలకు నిర్వహించిన వేలంపాటలో ఐదుగురు డిపాజిట్ దారులు పాల్గొనగా దేవస్థానానికి ఆశించిన వేలంపాట రానందున వాయిదా వేసినట్లు ఈఓ తెలిపారు. దేవాదాయ ధర్మాదాయ శాఖ గద్వాల డివిజన్ పర్యవేక్షణాధికారిణి వెంకటేశ్వరి ,ఆలయ కార్యనిర్వాహణాధికారి ఆర్.పురెంధర్ కుమార్ ,గ్రామ పెద్దలు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.



Printed and Published **MEKALA DAMODAR REDDY** on behalf of DBC Publications, and Printed at Vanitha Graphics, H.No. 3-3-76/123/21, Maruthi Enclave, Attapur, Rajendra Nagar, Ranga Reddy, Telangana-500048. and Published at: H.No. 6-2-4/2, 1st Floor, Shivarampally , NPA, Rajendra Nagar, Ranga Reddy Telangana-500052. **Editor: KOTLA CHANDRA KANTH. "RNI. Title- Code: TELTEL12231**. Cell: 9705231654.